

ఘనంగా హజరత్ మహబూబ్ సుభాని దస్తగిరి జెండా ఉత్సవాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని హోమియోపతి కాలేజ్ దగ్గర ఎ.ఎస్.ఆర్ నగర్‌లో వెలసి ఉన్న హజరత్ మహబూబ్ సుభాని దస్తగిరి సాహెబ్ దర్గా ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని, జెండా మెరవణి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సారి కూడా హజరత్ మహబూబ్ సుభాని దస్తగిరి సాహెబ్ ఉరుసు ఉత్సవాలను నిర్వహిస్తున్న దర్గా నిర్వాహకులు మహబూబ్ బాషాను అభినందించారు. దస్తగిరి జెండాను బ్యాండు వాయిద్యాలతో తీసుకొచ్చి దర్గాలో అలంకరించి, ప్రార్థనలు నిర్వహించారు. అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహబూబ్ సుభాని, దర్గా కమిటీ నిర్వాహకులు కె.ఎస్.మహబూబ్ బాషా, సభ్యులు టి బాష, ఎస్.మస్తాన్, షేక్. సాదక్ వలి, భక్తులు పాల్గొన్నారు.

బలమైన ప్రభుత్వ రంగ సంస్థలు అవసరం

- విద్య, వైద్యం, ప్రభుత్వ రంగం ఉమ్మడి అజెండాగా దేశంలో పోరాటాలు సాగాలి
- జియో నుంచి బిఎస్ఎన్ఎల్ వైపు ప్రజల చూపు మల్లుతోంది
- ఉత్తరాంధ్ర మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్. శర్మ



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - కడప అర్బన్

మన దేశపు మువ్వన్నెల జాతీయ పతాకం సగర్వంగా ఎగరాలంటే ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, కోల్, స్టీల్, రైల్వే, బిఎస్ఎన్ఎల్, డిఫెన్స్, విద్యుత్ తదితర పభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం బలహీనపరచడం మానుకోవాలని ఉత్తరాంధ్ర మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. ఆదివారం డివిజనల్ కార్యాలయ ఆవరణలో ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 'ప్రభుత్వ రంగ సంస్థలు ఈ దేశానికి ఎందుకు అవసరం?' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సంక్షోభాల నుంచి భారతదేశాన్ని ప్రభుత్వ రంగమే కాపాడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మాట వరసకు ఆత్మనిర్భరత అంటోందని, కానీ ఆచరణలో ప్రభుత్వ రంగ సంస్థలకు వాటి కార్యకలాపాలని అవే నిర్ణయించుకునే 'ఫంక్షనల్ అటానమీ' ఇవ్వడం లేదన్నారు. దేశంలో రైతుల ఆత్మహత్యలకు కేవలం వ్యవసాయ సంక్షోభమే కారణం కాదని, విద్యా, వైద్య రంగాలు ప్రయివేటీకరణకు గురి కావడం, రైతుల జీవితాల్ని ఛిద్రం చేయడంతో బతకలేక, దిక్కుతోచక ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన ఉద్ఘటించారు. ఆంధ్రప్రదేశ్ ను, అమరావతిని కార్పొరేట్ సంస్థల ద్వారా అభివృద్ధి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చెప్పే మాటలు అసంబద్ధమని పేర్కొన్నారు. ప్రయివేటీకరణ మత్తులో పాలకులు మాత్రమే ఉన్నారని, ప్రజలు దీనిని పూర్తిగా తిరస్కరిస్తున్నారని తెలిపారు. రిలయన్స్ జియోపై వినియోగదారులు నమ్మకం కోల్పోవడమే దీనికి తాజా సూచిక అన్నారు. కార్పొరేట్ మీడియా సృష్టిస్తున్న మాయాజాలాన్ని కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావి వర్గం సమర్థంగా ఎదుర్కోవడం ద్వారా ప్రయివేటీకరణ దాడిని తిప్పి కొట్టగలమని చెప్పారు. ఎల్ఐసిని రెండు దశాబ్దాల ప్రయివేటు పోటీ తర్వాత కూడా అగ్రశ్రేణిలో సిబ్బంది నిలబెట్టుకోవడం దీనికి ఉదాహరణ అన్నారు. డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో సంఘాల నాయకులు రఘునాథ్‌రెడ్డి, వసుప్రద, శంకర్రావు, మహేశ్వర్ రెడ్డి, సంజయ్, నిత్యానంద రెడ్డి (ఇన్సూరెన్స్), శ్రీనివాసుల రెడ్డి (సిఐటియు), లక్ష్మీ రాజా (యుటిఎఫ్), సుధాకర్, సుబ్బారావు (బిఎస్ఎన్ఎల్), అజీజ్, సాయికుమార్ (బ్యాంకింగ్), శివశంకర్ (విద్యుత్), సుబ్బారెడ్డి (పోస్టల్), రమణ (ఎస్సీ అధికారుల సంఘం), ఆచార్య రాంప్రసాద్ రెడ్డి (వైవీయూ), నరసింహారెడ్డి (జెవివి), దస్తగిరి రెడ్డి (రైతు సంఘం), ఎల్ఐసి యూనియన్ నాయకులు అక్బర్, సుధీకర్, అయ్యవారు రెడ్డి, వారిజాతమ్మ, రాజు, రత్నకిషోర్, రఘు, కుమార్, చిన్నయ్య, సాదక్, శ్రీనివాసులు, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వక్ఫ్ సవరణ చట్టం

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ఇష్టానుసారంగా మారుస్తూ ఉందని మాజీ ఎంఎల్‌సి ఎం.వి.ఎస్ శర్మ పేర్కొన్నారు. ఆదివారం కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉస్మాన్ ఖాన్ మసీదు లో వక్ఫ్ చట్ట సవరణ బిల్లు పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013లో సచార్ కమిటీ, రంగనాథ కమిటీ ఏదైతే రిపోర్ట్ ఇచ్చిందో దానిని అమలు చేయకుండా, ప్రస్తుత బిల్లును అమలు చేయాలని చూస్తున్నారని చెప్పారు. లౌకిక తత్వాన్ని ముస్లిములు మరింత పెంచుకోవాలని సూచించారు. ప్రజాశక్తి సాహితీ స్రవంతితో కలిసి పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు బాబు బాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసుల రెడ్డి, పలువురు ముస్లిమ్ సోదరులు పాల్గొన్నారు.

తాత్విక చింతనతోనే సామాజిక పురోభివృద్ధి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి : తాత్విక చింతనతోనే సామాజిక పురోభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రాచీన తాత్విక సిద్ధాంతాల్లోని అభ్యుదయ భావాలతో బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ఎదుర్కోవాలని మాజీ ఎంఎల్‌సి ఎం.వి.ఎస్ శర్మ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ ఆవరణంలోని పంచాయతీరాజ్ భవనంలో బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ సభ్యులు పిళ్లా కులాయి స్వామి అధ్యక్షతన మధ్య యుగాల్లో భారతీయ తాత్విక చింతన అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వర్తమానానికి ఉపయోగ పడే లా తాత్విక దృష్టి ఉండాలన్నారు. మతం వేరు..మతం పేరుతో రాజకీయాలు నడపడం ప్రజలకు ద్రోహం చేయడమే అవు తుందని తెలిపారు. తాత్విక చింతనను చరిత్ర నుంచి విడగొట్టడం కష్టమని చెప్పారు. కీ.శ ఆరవ శతాబ్దం నుంచి బౌద్ధ, జైన మతాలు వర్ధిల్లాయని తెలిపారు బౌద్ధం పశువులను వ్యవసాయానికి మళ్లించడంతో బహునులు బౌద్ధం వైపు ఆకర్షితులయ్యారని చెప్పారు. గుప్తుల పతనం అనంతరం చేతివృత్తుల వాళ్లు గ్రామాల్లోకి ప్రవేశించడంతో బ్రాహ్మణాధిపత్యానికి సవాళ్లు ఎదురయ్యాయని తెలిపారు. భక్తి ఉద్యమం అనంతరం సంఘసంస్కర్తలు వెలుగులోకి వచ్చారన్నారు. అనంతరం ప్రముఖ కవి దాదా హయత్ ఇస్లాం - సూఫీ - క్రిస్టియానిటీ అనే అంశంపై మాట్లాడుతూ యూనివర్సల్ బ్రదర్ హుడ్‌ను దెబ్బతీయడానికి సిటిజన్ షిప్‌ను తీసుకొచ్చారన్నారు. యూనిఫామ్ సివిల్‌కోడ్‌లోని మౌలిక లక్ష్యం ముస్లిములు, క్రిస్టియన్లు, బౌద్ధులపై మను స్మృతిని రుద్దడమేనని తెలిపారు. కార్యక్రమంలో బుద్ధిస్ట్ కల్చరల్ సభ్యులు ప్రసాద్, ప్రముఖ వైద్యులు ఓబుల్‌రెడ్డి, రాజావెంగల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, దస్తగిరిరెడ్డి పలువురు ఇంటలెక్చు వల్స్ పాల్గొన్నారు.

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

కడప - హైదరాబాద్ ఇండిగో విమాన సర్వీసు ప్రారంభోత్సవంలో రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప ఎయిర్ పోర్టులో కడప - హైదరాబాద్ ఇండిగో కనెక్టింగ్ విమాన సర్వీసును లాంఛనంగా ప్రారంభించారు. ఆయనతోపాటు ఎమ్మెల్యేలు పుట్టా సుధాకర్ యాదవ్, చైతన్య రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏడాదిగా కడప - హైదారాబాద్ విమాన సర్వీసులు లేవని తెలిపారు. ఎన్నో సార్లు లేఖలు రాసిన ప్రయోజనం లేదని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హైదారాబాద్ సర్వీసులు పునరుద్ధరించారని పేర్కొన్నారు. హైదరబాద్ కానెక్టివిటీ ద్వారా దేశంలో అన్ని చోట్లకు వెళ్లే సదుపాయం కలుగుతోందని తెలిపారు. కేంద్ర విమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కడప నుంచి దూర ప్రాంతాలకు కూడా త్వరలో కానెక్టివిటీ పెంచుతామని చెప్పారు. అలానే రైల్వే శాఖలో అభివృద్ధి చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 120 రోజులు దాటిందని తెలిపారు. విద్యుత్‌ఛార్జీల పెంపు పై మాజీ మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యలను ఆయన ఖండించారు. గత ప్రభుత్వం యూనిట్ నురూ. 5 నుంచి రూ. 7 కొనడం వల్లే ఈ భారం పడుతుందని చెప్పారు. అనుభవజ్ఞుడైన చంద్రబాబుకు ప్రజలకు ఏం చేయాలో తెలుసన్నారు. ప్రజలపై కూటమి ప్రభుత్వం ఏ భారం వేయదని చెప్పారు. ఢిల్లీకి కూడా విమాన సర్వీసులు నడిపేందుకు కేంద్ర మంత్రులతో మాట్లాడతామని పేర్కొన్నారు.

ప్రయివేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రయివేట్ పాఠశాలల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఉమేష్ చంద్ర కళ్యాణ మండపంలో అన్ ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా ప్రభుత్వ పాఠశాలలకు పోటీగా ప్రయివేటు పాఠశాలలు పనిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వానికి ప్రయిట్ పాఠశాలలు కూడా ఒక కన్నుగా ఉంటాయని చెప్పారు. ప్రయివేట్ పాఠశాలలు కూడా పేద విద్యార్థులను ఆదరించాలని చెప్పారు. న్యాయపరమైన సమస్యలను పరిశీలించి రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకునేందుకు దోహదపడతామని చెప్పారు. విద్యార్థులు మానసికంగానే కాకుండా శారీర దృఢత్వానికి అన్ని పాఠశాలలకు ఒక చట్టాన్ని తీసుకురాబోతున్నామని, అది పాఠశాలలో ఒక పీరియడ్ క్రీడకు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రయివేట్ పాఠశాలలకు, క్యాటగిరి వైజ్ విభజించి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకెళ్తామన్నారు. టిడిపి పోలిట్ బ్యూరో శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉస్మా ప్రెసిడెంట్ జి. శ్రీనివాసులరెడ్డి, సెక్రెటరీ టి. రమేష్ రెడ్డి, బీరం విద్యాసంస్థల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వివేకానంద రెడ్డి, ఏపీపీఎస్ఎ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం రాజు, ప్రయివేట్ డిగ్రీ కళాశాలల ప్రెసిడెంట్ మదన్ మోహన్ రెడ్డి, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాంతీయ పార్టీలను బలహీన పర్చడమే బిజెపి లక్ష్యం

సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి - బద్వేలు

జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలను బలహీనపరచాలన్నదే బిజెపి లక్ష్యమని సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం బద్వేలు స్థానిక కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిపిఎం పట్టణ కమిటీ విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారని పేర్కొన్నారు. వివరించారు. 2027లో దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలను నాశనం చేయాలనేది బిజెపి ఎన్నికల ఎజెండా వ్యూహంగా ఉందన్నారు. బిజెపి, జనసేన, చెబుతున్న, బలపరుస్తున్న సనాతన ధర్మం వల్లే ప్రజలను బానిసలుగా చరిత్రలో మిగిల్చిందన్నారు. వీరు చెబుతున్న సనాతన ధర్మమే, మహిళలను సతీసహగమనం, దళితులపై అంటరానితనం, శంభూకుని వధించడం జరిగిందన్నారు. దేశంలో 100 కార్పొరేట్ కంపెనీల శక్తుల కలయికతో బిజెపి ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని నడుపుతోందని, ఇది దేశ ప్రజలకు ప్రమాదకరమని ఆయన పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ విధానాలు, ప్రజా పోరాటాలే దేశాభివృద్ధికి మూలమని ప్రజలందరూ ఆలోచించాలని వారు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీనివాసులు, పట్టణ కమిటీ సభ్యులు నాగేంద్రబాబు, మోక్షమ్మ, శాఖ కార్యదర్శులు బాలమ్మ, మస్తాన్‌బీ, పిసికొండయ్య, రాయప్ప, శివకుమార్, పార్టీ సభ్యులు రాజగోపాల్ ఎస్.కె. ఆదిల్, ఖలీల్ బాషా, మాఫిర చార్లెస్, ఫాతిమా, బాలస్వామి, గురయ్య, సురేష్, దేవి సుబ్బమ్మ, వెంకటసుబ్బయ్య, చిన్న, వెంకటేష్, దేవి, రాణమ్మ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : ఎస్పి



మాట్లాడుతున్న సంఘ సేవకులు సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్

నేరాలను నిరోధించడంలో, నేరస్థులను గుర్తించి అరెస్ట్ చేయడంలో సి.సి కెమెరాల పాత్ర కీలకమైందని, షాపుల, వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని వ్యాపారులు తమ వంతు సామాజిక బాధ్యతగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పి వి.హర్షవర్ధన్ రాజు సూచించారు. ఆదివారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని వివిధ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులకు సిసి కెమెరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ వ్యాపారులకు సిసి కెమెరాల ప్రాధాన్యతను వివరించారు. ఎపి పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ 2013 మేరకు వంద అంతకంటే ఎక్కువ మంది గుమికూడే ప్రదేశాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. మునిసిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఈ చట్టం వర్తిస్తుందన్నారు. రికార్డయిన సి.సి ఫుటేజ్ వీడియోలు 30 రోజులపాటు నిల్వ ఉండేలా చూడాలని తెలిపారు. గత వారం రోజుల వ్యవధిలో సి.సి కెమెరాల వల్ల మూడు కేసులను ఛేదించామని చెప్పారు. నెల రోజుల వ్యవధిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న షాపుల సి.సి కెమెరాలను రోడ్డు వైపు తిప్పి ఉంచాలన్న పోలీస్ శాఖ సూచన మేరకు దాదాపు 1700 సి.సి కెమెరాలను రోడ్డు వైపు తిప్పడం సత్ఫలితాలు ఇచ్చిందని తెలిపారు. బాలుడు కిడ్నాప్ అంటూ వచ్చిన ఫిర్యాదుపై విచారణలో అది ఫేక్ కిడ్నాప్ గా తేలిందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతోనే కమ్యూనిటీ పోలీసింగ్ సాధ్యమని, ఆయా వర్గాల ప్రజలతో సమావేశం నిర్వహిస్తూ వారి అభిప్రాయాలు, వారి నుంచి వచ్చే సమాచారం తెలుసుకుని మరింత మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు. సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుటూ ఎస్పి హర్షవర్ధన్ రాజు నేరాలు అదుపు చేయడంలో, లా అండ్ ఆర్డర్‌ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. స్థానిక సమస్యలను ఎస్పి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాను నేర రహితంగా చేసేందుకు చేపట్టిన కార్యక్రమం పట్ల మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు ఎస్పి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ శాఖకు సహకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ బి.హేమ కుమార్, కడప వన్ టౌన్ సిఐ రామకృష్ణ, టూటౌన్ సిఐ నాగార్జున, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మధుమల్లేశ్వర రెడ్డి, జిల్లాలోని క్లాత్ మర్చంట్స్, గోల్డ్ షాప్స్, ఫాన్సీ, కిరానా, లారీ అసోసియేషన్, ఆయిల్ మిల్, బిల్డింగ్ వర్కర్స్, ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, సినిమా థియేటర్ల అసోసియేషన్ వారు పాల్గొన్నారు.

హామీ నిలబెట్టుకోవడం హర్షణీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవడం హర్షణీయమని సైనిక సంఘం గుంటూరు అధ్యక్షులు గోవిందరావు అన్నారు. ఆదివారం ఐఎంఎ హాలులో సైనిక కార్పొరేషన్, అన్ని సంఘాలు ఒకటిగా ఏర్పాటై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎంతో ఉదారంగా, ప్రతిష్టాత్మకంగా మాజీ సైనికుల సంక్షేమార్థం కేంద్ర రక్షణశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ హోంశాఖ భాగస్వామ్యంతో నడిచే ఈ అపెక్స్ కార్పొరేషన్‌ను ఏర్పరచి దీనికి రూ.10 కోట్లు ఫండ్‌ను కేటాయించడం, పునరావాసం కోసం తగిన చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఇందులో ఎటువంటి సంక్షేమాలు ఉండాలో బైలాను నిర్వహించలేదని చెప్పారు. సమస్యల పరిష్కారానికి సంఘాలను ఏక తాటిపైకి తీసుకురావటం గురించి చర్చించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు నిర్వహిస్తున్న మాజీ సైనికుల సమావేశాలకు డైరెక్టర్‌కు, ఏ జిల్లాల సైనిక కార్యాలయాలు, రాజకీయ పార్టీలకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. అన్ని జిల్లాల మాజీ సైనికుల నాయకులు ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సహకారం పొందాలని నిర్ణయించామన్నారు. జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు లక్ష్మినారాయణ మాట్లాడుతూ ఇటీవల కొందరు రాష్ట్ర సైనిక సంక్షేమ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వెంకట్‌రెడ్డి తన విధి నిర్వహణ సరిగ్గా నిర్వహించడం లేదని నిందారోపణలు చేశారని పేర్కొన్నారు. దీన్ని సమావేశంలో అన్ని సంఘాలు ఖండించాయని తెలిపారు. సైనిక సంఘాల సభ్యులతో బలోపేతమై ఒక్కటిగా ఏర్పడుటకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. సమావేశంలో సైనికులు, మాజీ సైనికులు, అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు పాల్గొన్నారు.



సంఘ సమావేశంలో మాజీ సైనికులు



ఎవిఎస్ రాజును సన్మానిస్తున్న కళాకారులు

'రాజు' ప్రతిభకు పట్టం

- ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

రంగస్థల నటునిగా, లఘు చిత్ర దర్శకునిగా ప్రతిభను చాటి నటీనటులను, దర్శకులను, కెమెరామెన్లను, గాయకులను, కళారంగానికి పరిచయం చేసిన ఎస్ రాజుకు నటకళాతపస్వి పురస్కారాన్ని ఇచ్చి ప్రతిభకు పట్టం కట్టారని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం కడపలో పెన్షనర్స్ కార్యాలయంలో మహా కవయిత్రి మొల్ల సాహితీ పీఠం, శ్రీ భాగ్యరత్న ఫౌండేషన్ వారు ఎవిఎస్ రాజుకు నటకళా తపస్వి పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ 1987, నుంచి లఘు చిత్ర దర్శకునిగా రాజు ఆడపిల్లంటే అంత అసహనమేల, ఒంటిమిట్ట రాములోరి చరిత్ర మొదలైన 100కు పైగా లఘు చిత్రాలు నిర్మించారన్నారు. సభాధ్యక్షులు, మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు, విద్వాన్ డాక్టర్ గానుగ పెంట హనుమంతరావు మాట్లాడుతూ రాజు, గూడూరు సావిత్రి, ఈమని శివ నాగిరెడ్డి, కమ్ము సోదరులు, బుర్ర సుబ్రహ్మణ్య శాస్త్రి మొదలైన ఉద్దండుల సరసన నటించడం నిజంగా అభినందనీయమన్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ రాజు రంగస్థలం నటుడిగా కాకుండా సినిమాల్లో కూడా నటించడం గర్వించదగిన అంశమని, ఆయన జీవితం భావితరాల వారికి ఆదర్శమన్నారు.కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి రాజు పై నవరత్నాలు అనే పేరుతో పద్యాలు రాసి ఆలపించారు. అనంతరం రాజును శాలువా,పూలమాల,ప్రశంసా పత్రం, సర్టిఫికెట్, పదివేల నగదు బహుమతితో ఘనంగా సత్కరించారు.



ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న అతిథులు

ఘనంగా జెవివి చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం బాలాజీ నగర్‌లోని ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ మండలాల నుంచి ప్రయివేట్ పాఠశాలలు 15 టీములు, ప్రభుత్వ పాఠశాలల 22 టీములు హాజరయ్యాయి. ముఖ్యఅతిథిగా చెన్నూరు ఎండిఒ సునీత, ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. వీరి చేతులమీదుగా ప్రశ్నాపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెవివి ఆశయాలను గుర్తు చేస్తూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని, సమాజంలో శాస్త్రీయతను కోరుకోవాలని సూచించారు. నైతిక విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని, మంచి ప్రవర్తన అలవరచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎ.డి.దేవదత్తం, జిల్లా అధ్యక్షులు షామీర్‌బాష, ప్రధాన కార్యదర్శి బయన్న, కార్యదర్శి సృజన్, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, సునీత, అరుణ, ఎస్తేరు రాణి, రంగనాయకులు, మధు, శివరాం, సుబ్రహ్మణ్యం, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెంపోరల్ వెట్‌బోన్ శస్త్రచికిత్సపై ప్రత్యేక శిక్షణ

ప్రముఖ ఇఎన్‌టి వైద్యులు డాక్టర్ హరికిషన్ బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

చెవి, ముక్కు, గొంతు విభాగంలో విద్యనభ్యసిస్తున్న, దేశంలోని వివిధ వైద్య కళాశాలల్లో శిక్షణ తీసుకుంటున్న యువవైద్యులకు కడప నగరానికి చెందిన ప్రముఖ చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డాక్టర్ హరికిషన్‌బాబు (గోల్డ్ మెడలిస్టు) టెంపోరల్ వెట్‌బోన్ చెవికి సంబంధించిన ఎముక శస్త్ర చికిత్సలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఈ నెల 26,27 తేదీల్లో నిర్వహించారు. నగరంలోని వై జంక్షన్ సమీపంలో ఉన్న విజయ ఇఎన్‌టి, చైల్డ్ కేర్ ఆసుపత్రిలో రెండు రోజుల పాటు శిక్ష ఇచ్చారు. వైద్య విద్యలో ఇఎన్‌టి విభాగానికి చెందినవారు, టిఎన్‌టి డాక్టర్లుగా సేవలందిస్తున్నవారు హాజరయ్యారు. చెవికి సంబంధించిన శస్త్రచికిత్సలలో మెళుకువలను, జాగ్రత్తల గురించి తెలుసుకున్నారు. మూ డేళ్లుగా డాక్టర్ హరికిషన్ బాబు శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. భావివైద్య విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తూ పలువురి ప్రశంసలందుకుంటున్నారు. డాక్టర్ హరికిషన్ బాబును అభినందించారు. క్రమం తప్పకుండా ప్రతి ఏడాది శిక్షణ నిర్వహించడం పట్ల అపోలో ఆసు పత్రి, నెల్లూరు కన్సల్టెంట్ వైద్యులు డాక్టర్ సతీష్‌కుమార్, తిరుపతి స్విమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ అమర్‌నాథ్, తెనాలి నుంచి డాక్టర్ సురేష్ చెవికి సంబంధించిన ఎముకకు శస్త్ర చికిత్సలోని మెళకువలను, విధానాలను జాగ్రత్తలను విపులంగా యువ వైద్యులకు డాక్టర్ హరికిరణ్ బాబు వివరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



శిక్షణ తీసుకున్న యువ వైద్యులతో డాక్టర్ హరికిషన్ బాబు

తండ్రి మందలించాడని..

ఉరేసుకొని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - వేంపల్లె



మృతి చెందిన సానియా

బాగా చదువుకోవాలని తండ్రి మందలించడంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వేంపల్లెలో చోటు చేసుకుంది ఎస్ఐ రంగారావు వివరాల మేరకు స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న షామీర్ ఆటోడ్రైవర్ జీవనం సాగిస్తున్నాడు. అతని కుమార్తె సానియా (21) ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. విద్యార్థి సరిగ్గా చదువకపోవడం, కళాశాలకు సక్రమంగా వెళ్లకపోవడం, ఇంటి వద్ద టీవీ చూస్తుండడంతో తండ్రి కుమార్తెను మందలించాడు. బాగా చదుకోవాలని నచ్చజెప్పాడు. తీవ్ర మనస్థాపానికి గురైన సానియా శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని చనిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి పరిశీలించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సానియా మృతదేహానికి వేంపల్లె ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - వల్లూరు



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దాతలు

నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మీదేవి, చిట్టెమ్మకు మండల టిడిపి నాయకుడు లేబాక నాగేశ్వర్‌రెడ్డి చేతులు మీదుగా ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మనం మన గ్రామం సేవ సమితి సభ్యుల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పేదరికంతో బాధపడుతున్న లక్ష్మీదేవి, చిట్టేమ్మకు అండగా నిలవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. మనం మన గ్రామ సేవా సమితి ఎలాంటి కార్యక్ర మాలు చేయడం మండలంలో పేద కుటుంబాన్ని ఆదుకోవడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు, మాజీ ఉపసర్పంచ్ ఆంజనే యులు, మనం మన గ్రామం సేవలు వెంకటేష్‌రెడ్డి , సౌజన్యరెడ్డి, చిట్టిబాబు, యుగేందర్‌రెడ్డి, వేద రెడ్డి పాల్గొన్నారు.

ఆచార్య ఈశ్వర్‌రెడ్డికి కవి సంధ్య ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆచార్యులు ఎన్.ఈశ్వర్‌రెడ్డి 'కవి సంధ్య ప్రతిభా పురస్కారం' అందుకున్నారు. ఆదివారం యానాంలోని గీతా భవన్‌లో కవి సంధ్య స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ సభలో పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. గేయ సాహిత్య విభాగంలో ఈశ్వర రెడ్డి చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ఇస్తున్నట్టు ప్రకటించారు. అనేక సామాజిక సందర్భాలకు ఈయన గేయాలను అందించారు. ఆత్మహత్యలకు పాల్పడకూడదని, పొగాకు మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, బట్టీ చదువులు విద్యార్థుల మానసిక వికాసానికి దోహదం చేయవని, మహిళలు చైతన్యంతో ముందుకు సాగాలని, రాయలసీమ రైతుల వలస బతుకులను ప్రపంచానికి తెలియజేసే విధంగా వచ్చిన గేయాలు బహుళ ప్రచారం పొందాయి. కార్యక్రమంలో ప్రఖ్యాత కవి డాక్టర్ శిఖామణి, పాండిచ్చేరి పూర్వ మంత్రి అల్లాడి కృష్ణారావు, కవి రచయిత పూర్వ ఐఎఎస్ అధికారి వాడ్రేవు చిన వీరభద్రుడు, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ పూర్వ సంచాలకులు దీర్ఘాసి విజయభాస్కర్, కవి సంధ్య సంపాదకులు వరుగు భాస్కర్ రెడ్డి, డాక్టర్.గూటం స్వామి పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సిపిఆర్ చికిత్సపై అవగాహనలో విద్యార్థులు

సిపిఆర్ చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి - ఖాజీపేట

సిపిఆర్ చికిత్స విధానంపై ఆదివారం బీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్లో విద్యార్థులకు సిపిఆర్ చికిత్స విధానంపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో చిన్న వయసులోనే ఎక్కువ మంది గుండెపోటుకు గురవుతున్నారని, ఒక్కోసారి కారణంగా ప్రాణాపాయ సంఘటనలు సంభవిస్తున్నాయని బీరం విద్యాసంస్థల కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో న్యూరో కేర్ డాక్టర్ నవీన్ ప్రసాద్, డాక్టర్ నవీన్‌కుమార్ సిపిఆర్ విధానం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆరోగ్య సంబంధిత సలహాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గుండెపోటు సమయంలో చేయాల్సిన సిపిఆర్ చికిత్స విధానం గురించి విద్యార్థులకు, సిబ్బందికి అవగాహన కల్పించి, వివరించారు. స్కూల్ డైరెక్టర్ సరస్వతమ్మ మాట్లాడుతూ సిపిఆర్ చికిత్స విధానం అత్యవసర సమయాల్లో ప్రాణాలు నుంచి బయటపడవచ్చు అన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ బీరం స్వాతి శ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్, జూనియర్ డాక్టర్లు రమణి, మేరీ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలు.. సమస్యలనేకం

ప్రజాశక్తి - ఖాజీపేట

అంగన్వాడీ కేంద్రాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. 0 నుంచి 6 సంవత్సరాల వయసు గల పిల్లలకు ప్రీ ప్రైమరీ స్కూల్స్‌గా మార్చి ఆటపాటలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సేవలు పొందుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 79 అంగన్వాడీ, మినీ అంగన్వాడీ కేంద్రాలున్నాయి. దాదాపు నాలుగు వేల రెండు వందల మంది గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సేవలు పొందుతున్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం వారికి అందనంత దూరంగా మారింది. అంగన్వాడీ కేంద్రాలు ద్వారా అందిస్తున్న పాలు నాణ్యమైనవిగా లేవని ఆరోపిస్తున్నారు. గతంలో పాలు చాలా రోజులపాటు నిల్వ ఉండేవన్నారు. నాణ్యత లేని పాలపై లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదని సిబ్బంది వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన పాలను, నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

చంద్రబాబు స్క్రిప్ట్ షర్మిల చదువుతుందనడం హాస్యాస్పదం

- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

చంద్రబాబు స్క్రిప్ట్ షర్మిల చదువుతుందని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మరికొందరు వైసిపి నేతలు మాట్లాడడం హాస్యాస్పదమని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నక్క ఎక్కడ, నాగలోకమెక్కడ అన్నారు. కాంగ్రెస్ ఒక వటవృక్షమన్నారు. వట వృక్షానికి ఊడలు లాంటి వారు జగన్, చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని తెలిపారు. జగన్‌కు డబ్బు, అధికార పిచ్చి ఎక్కువని విమర్శించారు. మద్యం పాలసీ, బెల్టు షాపులపై సిపిఎం ఉత్తర కుమార ప్రగల్భాలు, బీద అరుపులు, ఉత్తుత్తి బెదిరింపులే అన్నారు. క్షేత్ర స్థాయిలో మండలంలో 4 మద్యం షాపులు, 40 బెల్టు షాపులు ఉన్నాయని ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు అన్ని వేళలా తెరుస్తున్నారని, వారాల ముందే బ్రాంది షాపులను తెరుస్తున్నారని తెలిపారు. మద్యం సిండికేట్, బెల్టు షాపులు పెట్టకుండా ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించాలని ఆయన కోరారు.



రోడ్డును కప్పేస్తున్న కంపచెట్లు

అధ్వానం గొందిపల్లి-రంగోరుపల్లి రోడ్డు

ప్రయాణికుల ఇబ్బంది - పట్టని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - వేముల

స్థానిక పులివెందుల-కడప ప్రధాన రహదారి నుండి గొందిపల్లి-రంగోరుపల్లి గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డుకిరువైపులా కంపచెట్లు పెరుగుతున్నాయి. పూర్తిగా రోడ్డును కప్పేస్తున్నాయి. ఆ రోడ్డున వెళ్లేందుకు ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కంప చెట్లు ఇప్పటికే రోడ్డుపైకి వచ్చి ప్రయాణానికి తీవ్ర ఆటంకాలు కలిగిస్తున్నాయి. నిత్యం వేల సంఖ్యలో ఈ ఆర్‌అండ్‌బి రహదారిలో రాకపోకలు సాగిస్తుంటారు. గొందిపల్లి, రంగోరుపల్లితోపాటు పెద్ద పాడుకు కూడా ఈ రోడ్డులోనే ప్రయాణం చేస్తూ ఉంటారు. సమస్యను సంబంధిత ఎఇఇ గణేష్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా.. నిధులు లేవంటూ చెబుతున్నారని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై వచ్చిన కంపచెట్లను తొలగించాలని ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

నేడు వేంపల్లె మండల సమావేశం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక వైఎస్ఆర్ సభా భవనంలో సోమవారం వేంపల్లె మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కూళయమ్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిపి లక్ష్మి గాయత్రి అధ్యక్షతన ఏర్పాటు చేశామన్నారు. ఆయా శాఖల పథకాలపై సమీక్షిస్తామన్నారు. సమావేశానికి మండలంలోని ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యంతోపాటు పలు అంశాలపై సమీక్ష చేయనున్నట్లు వివరించారు. ఎంపిటిసిలు, సర్పంచులు తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు.

క్రైం కార్నర్

కెసి కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని విశ్వనాథపురం గ్రామం వద్ద ఆదివారం కెసి కెనాల్ నీటిలో 40నుంచి 50ఏళ్ల మధ్య వయసున్న గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించిందని ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు మహిళ మృతదేహాన్ని కాలువ నుంచి వెలికి తీశామన్నారు. సదరు మహిళ ఒంటిపై ఆకుపచ్చ రంగు జాకెట్, ఆకుపచ్చ, గోధుమ, బ్లూ రంగు గల చీర, ఎడమ చేతికి ఎరుపు రంగు మట్టి గాజు, కుడి చేతికి ఆకుపచ్చ రంగు మట్టి గాజు, చెవులకు కమ్మలు, నడుముకు బీరువా తాళాలున్నట్లు గుర్తించామన్నారు. ఫొటోలోని మహిళ ఆచూకీ తెలిసిన వారు 91211 00601, 91211 00621నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

మా వాళ్లకే ఇవ్వాలి..!

అధికారులపై పెరుగుతున్న ఒత్తిడి - మండలానికి 25 గోకులాలు మంజూరు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో గోకులం షెడ్ల నిర్మాణానికి భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. మండలానికి 25 షెడ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మండల వ్యాప్తంగా 135 దరఖాస్తులు వచ్చాయి. వీటి మంజూరుకు రాజకీయ నాయకుల నుంచి అధికారులపై ఒత్తిళ్లు అధికమైనట్లు సమాచారం. తాము సూచించిన వారికే మంజూరు చేయాలంటూ మౌఖిక ఆదేశాలు ఉండడంతో ఏమి చేయాలో తెలియక అధికారులు తలను పట్టుకుంటున్నారు. సామాన్య పాడి రైతులకు షెడ్లు మంజూరయ్యే పరిస్థితి కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వ హయాంలో పాడి రైతులను ఆదుకునేందుకు మినీ గోకులాలు మంజూరయ్యాయి. గత టిడిపి హయాంలో ఈ పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేసి నిర్మాణాలు చేపట్టారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గోకులాల మంజూరు కనిపించలేదు. మళ్లీ టిడిపి అధికారంలోకి రావడంతో గోకులాల పథకం పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. ఇందులో పాడి రైతులకు 90 శాతం, మేకల, గొర్రెల కాపరులకు, కోళ్ల పెంపకం దారులకు 70 శాతం రాయితీతో గోకులం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు ఇవ్వనుంది. మండల వ్యాప్తంగా గేదెలు, ఆవులు 10,400, గొర్రెలు, మేకలు 24,500, కోళ్లు 5,5000 ఉన్నట్లు పశువర్ధక శాఖ గణాంకాలు చెబుతున్నాయి .

గోకులం మంజూరుకు కమిటీ ఏర్పాటు..

మినీ గోకులం ఏర్పాటుకు సంబంధించి మండలస్థాయిలో ఎంపిడిఒ చైర్మన్‌గా కమిటీని ప్రభుత్వ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఉపాధి ఎపిఒ, వెలుగు ఎపిఎం, వెటర్నరీ డాక్టరు, పశుసంవర్ధక అసిస్టెంట్ డైరెక్టర్ సభ్యులుగా ఉన్నారు. వీరు అర్హత కలిగిన పాడి రైతులను, పశు కాపరులను, కోళ్ల పెంపకందారులను ఎంపిక చేయాల్సి ఉంది. ఇప్పటివరకు మండలంలో 8 గోకులాలకు సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేసి పంచాయతీ వారోత్సవాల్లో గోకులం నిర్మాణానికి భూమిపూజ చేశారు. మిగిలిన లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. గోకులం షెడ్లకు సంబంధించి రెండు పశువులు ఉన్న రైతులకు యూనిట్ ధర రూ.11,5000 కాగా రాయితీ రూ.10,3500 పోనూ రైతు వాటా కింద రూ.11,500 చెల్లించాల్సి ఉంది. నాలుగు పశువులు ఉన్న రైతులకు యూనిట్ ధర రూ.1,85,000 కాగా రాయితీ రూ.1,66,500 పోనూ రైతు వాటా కింద రూ.18,500 చెల్లించాల్సింది. ఆరు కంటే ఎక్కువ పశువులు ఉన్న రైతులకు యూనిట్ ధర రూ.2,30,000 కాగా రాయితీ రూ.2,07,500 పోనూ రైతు వాటా కింద రూ.22,500 చెల్లించాల్సి ఉంది. గొర్రెల కాపరులకు సంబంధించి 20 జీవాలున్న రైతులకు యూనిట్ ధర రూ.1,30,000 కాగా రాయితీ రూ.91,000 పోనూ రైతు వాటా కింద రూ.39,000 చెల్లించాల్సి ఉంది. 50 జీవాలు ఉన్న రైతులకు యూనిట్ ధర రూ.2,30,000 కాగా రాయితీ రూ.1,61,000 పోనూ రైతు వాటా కింద రూ.69,000 చెల్లించాల్సి ఉంది. కోళ్ల పెంపకం దారులకు సంబంధించి 100 కోళ్లు ఉన్న వారికి యూనిట్ ధర రూ.87,000 కాగా రాయితీ రూ.60,900 పోనూ పెంపకం దారుడు రూ.26,100 చెల్లించాల్సి ఉంది. 200 కోళ్లు ఉన్న పెంపకం దారులకు యూనిట్ ధర రూ.1,32,000 కాగా రాయితీ రూ.92,400 పోనూ పెంపకం దారుడు రూ.39,600 చెల్లించాల్సి ఉంది.



ఆరుబయట చెట్టు కింద ఉన్న గేదెలు

అర్హత కలిగిన వారికే మంజూరు చేస్తాం..

మండల వ్యాప్తంగా మినీ గోకులాలకు సంబంధించి అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చిన మాట వాస్తవమే. ఇందులో రాజకీయ నాయకుల సిపార్సు కాకుండా కమిటీ సిఫార్సు మేరకే లబ్ధిదారులను ఎంపిక చేస్తాం. అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరిన్ని గోకులాల మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- యూసఫ్, పశువైద్యాధికారి, బిదినంచర్ల

విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి - చాపాడు



నేట్లపల్లి శివరామ్

ప్రతి పక్షనేతగా ఎన్నికల ప్రచారంలో హామీల్లో భాగంగా చంద్ర బాబు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పారని వైసిపి జిల్లా ప్రధాన కార్య దర్శి నేట్లపల్లి శివరామ్ గుర్తు చేశారు. స్థానికంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే విద్యుత్ ఛార్జీలు తగ్గించి నాణ్యమైన విద్యుత్ విని యోగదారులకు ఇస్తామని చంద్రబాబు చెప్పారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే సర్దుబాటు ఛార్జీల పేరిట రూ.6,072 కోట్ల విద్యుత్ భారాన్ని పేద, మధ్య తరగతి ప్రజలపై మోపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. విద్యుత్ ఇంధన సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్‌పిపిసిఎ) 2022-23 సంవత్సరానికి దాదాపు రూ.6,072 కోట్లు భారం వేస్తూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలతో విద్యుత్ నియంత్రణ మండలి (ఇఆర్‌సి) నోటిఫికేషన్ జారీ చేయడాన్ని తక్షణం ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు పెరగడం, మరోవైపు ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలపై ఇలా విద్యుత్ భారాలు మోపడం బాధాకరమన్నారు. 2022-23లో వాడిన కరెంటుకు ఈ నవంబర్ నెల నుండి 2026 జనవరి వరకు యూనిట్‌కు దాదాపు రూ.1.62 పైసలు అదనంగా చెల్లించాలని తాజా ఉత్తర్వు విద్యుత్ రెగ్యులేటర్ కమిషన్ ఇచ్చిందన్నారు. ఇది వినియోగదారులకు, పేదలకు పెను భారమని పేర్కొన్నారు. చంద్రబాబు మాట తప్పి ప్రజలపై వేసిన ట్రూ ఆప్ ఛార్జీల భారాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా చంద్రబాబు 41 శాతం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విడిచారని శివరామ్ గుర్తు చేశారు.

అలుపెరగని నిత్య కృషీవలుడు 'కాశీవరపు'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత, అతిథులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు సాహిత్య కేదారంలో అలుపెరుగని నిత్య కృషీవలుడు కాశీవరపు వెంకట సుబ్బయ్య అని అవధాని నరాల రామారెడ్డి పేర్కొన్నారు. చైతన్య సాహిత్య కళా వేదిక ఆధ్వర్యంలో కాశీవరపు వెంకటసుబ్బయ్య రచించిన తుమ్మెద పదాలు పుస్తకావిష్కరణ సభ ఆదివారం స్థానిక అనిబిసెంట్ పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. అతిథులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత తన అల్లుడైన హేమాద్రి సాగర్‌కు పుస్తకాన్ని అంకితమిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన నరాల రామారెడ్డి మాట్లాడుతూ కాశీవరపు వెంకటసుబ్బయ్య కడప జిల్లా మాండలిక భాషలో గ్రామీణ జీవితం ప్రతిబింబించే ఎన్నో కథానికలను రచించిన అభ్యుదయ దృక్పథం కలిగిన రచయిత అని కొనియాడారు. ఆయన కలం నుండి వచ్చిన ఈ తుమ్మెద పదాలు సమాజంలో మంచిని పెంచడమే ధ్యేయంగా రాశారన్నారు. కథలు, కవితలు రెండింటిని కూడా రాయగలిగిన విలక్షణతను వెంకటసుబ్బయ్య సాధించారని నరాల రామారెడ్డి పేర్కొన్నారు. ప్రముఖ పద్యకవి ఎసి దస్తగిరి మాట్లాడుతూ వెంకటసుబ్బయ్య గారి భాష అందరికీ అర్థమయ్యేలా తేలికగా ఉందన్నారు. భాషలో తెలుగు నుడికారం ఉందన్నారు. తెలుగు భాషకు ఆదరణ తగ్గి భాష మనుగడే ప్రశ్నార్థకంగా మారిందని భావిస్తున్న తరుణంలో తెలుగులో ఇలాంటి రచనలు రావడం అభినందనీయమన్నారు. ప్రముఖ అనువాద రచయిత కొమ్మిశెట్టి మోహన్ మాట్లాడుతూ కాశీవరపు వెంకటసుబ్బయ్య సాహిత్యం పట్ల అమితమైన ప్రేమ కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు. నిరంతర అధ్యయనశీలి, తన చుట్టూ ఉన్న సమాజాన్ని బాగా అధ్యయనం చేశారన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డి.కె.చదువులబాబు మాట్లాడుతూ కాశీవరపు వెంకట సుబ్బయ్య సాహిత్యమే శ్వాసగా, ధ్యాసగా, జిజ్ఞాసగా జీవి స్తున్నారన్నారు. పుస్తక సమీక్షకులు కొత్తపల్లి శీను మాట్లాడుతూ సమా జంలోని అస మానతలను, చెడును, స్వార్థాన్ని, తప్పుడు ఆలోచనలను ఖండి స్తూ, మంచిని ప్రబోధిస్తూ, మనిషి మనసులో మంచిని ప్రతిష్టించడమే లక్ష్యంగా తుమ్మెద పదాలు ఆయన రచించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సి.వి.సురేష్, భూక్యా గోపాల్ నాయక్, పల్లా రామారావు, హేమాద్రి సాగర్, గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, కొత్తపల్లి శ్రీను, రాజేంద్ర కుమార్, సాహిత్యాభి. మానులు పాల్గొన్నారు.

అందుబాటులోకి గోడౌన్లు : ఎమ్మెల్యే



గౌడౌన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ప్రజాశక్తి - చాపాడు

రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ ఉంచుకునే అవకాశం గౌడౌన్ల ద్వారా సాధ్యమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. చాపాడు సమీపంలో రాజువారిపేటకు చెందిన వెన్నపూస వెంకటసుబ్బారెడ్డి, సుజాత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ ప్రసన్న ఆంజనేయ రూరల్ గౌడౌన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను వ్యాపారులు అడిగిన ధరలకు కాకుండా వారికి నచ్చిన ధరకు అమ్ముకునే వరకు నిల్వ ఉంచుకోవాలంటే అందుకు అనుగుణంగా గోడౌన్ల అవసరం ఉందన్నారు. మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో ధాన్యం నిలువచేసే గోడౌన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కొంతమంది రైతు శ్రేయోభిలాషులు గౌడౌన్‌లను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్ రెడ్డి, టిడిపి నాయకులు వెన్నపూస కిషోర్‌కుమార్ రెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, వైవి సుబ్బారెడ్డి, మేకల బాబు, నారాయణ యాదవ్, ఎపి రవీంద్ర, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు : 'పుట్టా'

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి ఎకరాకు సాగునీటిని అందించి, వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని కన్నెలవాగు చెరువును ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కన్నెలవాగు చెరువుకు కృష్ణ జలాలను అందించి, పొలాలను సస్యశ్యామలం చేయాలన్నదే తన సంకల్పమన్నారు. చెరువులు రైతులకు కల్పతరువు లాంటివని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

బైపాస్ రోడ్డులోని వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో వెలగని దీపాలను డివైఎఫ్ఐ పట్టణ నాయకత్వంతో కలిసి పరిశీ లించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కొద్ది రోజులుగా ప్రొద్దు టూరు బైపాస్ రోడ్డు కూడలిలో ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లు వెలగడం లేదన్నారు. ఈ వైపు రోజు రాత్రి సమయాల్లో వందలాది భారీ వాహనాలు, ద్విచక్ర వాహ నాలు, ప్రజలు వెళుతూ ఉంటారన్నారు. చీకటిలో వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఆ వైపున చాలా రోడ్డు ప్రమా దాలు కూడా జరిగిన సంఘటనలు ఉన్నాయన్నారు. అది డేంజర్ జోన్ అన్నారు. అంత ప్రమాదకరమైన చోటున లైట్లు వెలుగకపోతే ఎలా అని ఆయన మున్సి పాలిటీ అధికారులను ప్రశ్నించారు. తక్షణమే ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో ఫ్లడ్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐగా కోరు తున్నామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి తులసీశ్వర్ యాదవ్, లోకేష్, మ హేష్ పాల్గొన్నారు.



వెలగని లైట్లను చూపుతున్న డివైఎఫ్ఐ నాయకులు



సమస్యలు వింటున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సమస్యల పరిష్కారానికి పోరాడుదామని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వారి సమస్యలను ఆయనకి విన్నవించుకున్నారు. ఇందుకు ఆయన స్పందిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. అధైర్య పడవద్దని తెలిపారు. ఎప్పటికీ మీ వెంటే ఉంటామని ఎంపీ తెలిపారు. అనంతరం ఆయన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.



నందీశ్వరుడి విగ్రహావిష్కరణలో పాల్గొన్న మహిళలు

ఘనంగా నందీశ్వరుడి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని నందిపల్లె గ్రామంలో నందీశ్వరుడి భారీ విగ్రహాన్ని ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. నందిపల్లె గ్రామ సర్పంచ్ మారం సులోచనదేవి కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. వేద పండితులు సమక్షంలో నందిశ్వరుడి విగ్రహం ఏర్పాటు చేయడంతో గ్రామ ప్రజలు భారీ ఎత్తున హాజరయ్యారు. నందిపల్లె శివాలయం డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో దాదాపు 6.5 అడుగుల నందిశ్వరుడి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సొసైటీ అధ్యక్షుడు మారం శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. నందిపల్లి గ్రామానికి చిహ్నంగా నందిశ్వరుని విగ్రహం ఏర్పాటు చేయడం శుభపరిణామమని సర్పంచ్ మారం సులోచనదేవి తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ డ్వామా పీడీ యధుభూషణ్‌రెడ్డి, సొసైటీ ఉపాధ్యక్షుడు చంద్రఓబుల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామగంగిరెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీరామిరెడ్డి, కోశాధికారి రామలింగేశ్వరరెడ్డి, సభ్యులు ముతుకూరు రామాంజనేయరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

గుంతను తవ్వారు.. పూడ్చడం మరిచారు

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక మైదుకూరు రోడ్డులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఆర్ఇఎస్ఎస్‌వి జూనియర్ కళాశాల వద్ద ప్రధాన రహదారిపై తాగునీటి అవసరాల నిమిత్తం గొట్టాలను అమర్చడానికి గుంతను తవ్వారు. పనులు పూర్తయినా ప్రధాన రహదారిపై గుంతను పూడ్చలేదు. వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఉంటాయి. ప్రభుత్వ కార్యాల యాలకు సమీపంలోనే ప్రధాన రహదారిపై పెద్ద పాటి గుంత ఉన్నా అధికా రులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వాహనదారులకు దగ్గరికి వచ్చే వరకు గుంత కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారిపై పెద్ద గుంత ఉన్నా మరమ్మత్తులకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి రహదారికి మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



తుషార్ నాగిరెడ్డిని సత్కరిస్తున్న మానవత సభ్యులు

సేవలను మరింత ముందుకు తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని, ఆ సేవలను మరింత ముందుకు తీసుకెళ్లాలని వైసిపి యవనేత సింగారెడ్డి తుషార్ నాగిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన మానవత మాసాంతర సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా ముందుకు వెళుతున్న మానవత సంస్థకు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. మానవత ఉపాధ్యక్షుడు డాక్టర్ యోగిశ్వర బాబు సంస్థకు చెందిన రిజిస్టర్లు, వస్తువులు భద్రపరిచేందుకు బీరువా అందిస్తామని ప్రకటించడం హర్షణీమని సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి తెలిపారు. సభ్యత్వ నమోదు ఈనెల ఆఖరులోపు పూర్తి చేసి వచ్చే నిధులను సమాజసేవకు ఉపయోగపడేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం మానవత ఆధ్వర్యంలో తుషార్ నాగిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మానవత సహాయ చైర్మన్ కావలి క్రిష్ణతేజ, కన్వీనర్ రంగారెడ్డి, అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రావణ్, కార్యదర్శి శివ, కోశాధికారి శ్రీకళ, డైరెక్టర్లు రంగయ్య, రాజారాం, మధు, తేజేశ్వర్, గంగయ్య, డాక్టర్ అరుణ్, చైతన్య పాల్గొన్నారు.

గ్యాస్ లీక్‌తో మంటలు..రూ.20 వేలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి - వేంపల్లె

పట్టణ పరిధిలోని చింతలమడుగుపల్లె గ్రామంలో గ్యాస్ లీకై రూ.20 వేలు ఆస్తి నష్టం వాటిల్లింది. గ్యాస్ లీక్ కావడం వల్ల మంటలు చెలరేగిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకొంది. ఫైర్ ఇన్‌ఛార్జి అధికారి వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాలు మేరకు.. చింతలమడుగుపల్లె గ్రామంలోని గిరిధర్‌రెడ్డి ఇంట్లో గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడ ఉన్న వంట సామగ్రి కాలిపోయింది. సమయానికి ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు ఆర్పేశారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ గ్యాస్ లీక్ అయిన వెంటనే రెగ్యులేటర్ ఆపేయాలన్నారు. తడిగా ఉన్న సంచి పట్టను కప్పాలని సూచించారు. పైప్ కాలం చెల్లడంతో మెత్తబడి గ్యాస్ లీక్ అయి మంటలు వచ్చినట్లు తెలిపారు. సమయానికి తమకు సమాచారం ఇవ్వడంతో పెద్ద ప్రమాదం తప్పిదని చెప్పారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది సంజీవరెడ్డి, హరిబాబు, శివకుమార్, జాన్‌కుమార్ పాల్గొన్నారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది